

ప్రమాదాల్లో నలుగురు మృతి

కోదాడ, మునగాల, చివ్వెంల, త్రిపురారం మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. -8లో



సాగర్‌లో శ్రీలంక ప్రతినిధులు

శ్రీలంకకు చెందిన 30మంది మీడియా ప్రతినిధుల బృందం శుక్రవారం సాగర్ ప్రాజెక్టు, బుద్ధవనాన్ని సందర్శించింది. -8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మట్టపల్లిలో నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణతంతు పూర్తి చేశారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి ఆలయ ప్రవేశానంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల రెన్యూవల్

భానుపురి (సూర్యాపేట): సదరం సర్టిఫికెట్ కలిగి ఉండి ఈనెల గడువు ముగిసిన వారు రెన్యూవల్ చేసుకోవాలని, ఇందు కోసం మీ సేవ కేంద్రంలో ఆధార్ కార్డు, గడువు ముగిసిన సదరం సర్టిఫికెట్‌తో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ మధుసూదనరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ అయిన తదుపరి మీసేవ కేంద్రం జారీ చేసే రశీదులో తేదీ ప్రకారం సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో ఉదయం 9 గంటలకు శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. ఈనెల 6, 10, 12, 18, 20, 24, 27, 31వ తేదీల్లో సదరం రెన్యూవల్ శిబిరాలు ఉంటాయని తెలిపారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి



చింతలకుంటతండాలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీపీఓ సురేష్, అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సురేష్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో పర్యటించారు. గ్రామ పంచాయతీ రికార్డులతోపాటు వీధుల్లో కలియదిరిగి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మారయ్య, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, కార్యదర్శి సురేష్, ఏఎన్‌ఎం తదితరులు రజిత తదితరులు పాల్గొన్నారు.

హర్రర్ గ్యాంగ్

దొంగల్లో అతిప్రమాదకరం.. పార్థి ముఠా

- ఒకప్పుడు ఇతర రాష్ట్రాల్లో వీరి సంచారం
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన పార్థి గ్యాంగ్ దొంగతనాలు
- హైవే వెంట, పట్టణాల్లో ఇటీవల పెరిగిన దోపిడీలు
- అది వారి పనేనని నిర్ధారణకు వచ్చిన పోలీసులు
- అమాకీపై నిఘా పెట్టి, వెంబడించి ఇద్దరి పట్టివేత



నల్లగొండ సీసీఎస్ పోలీసులు పట్టుకున్న పార్థిగ్యాంగ్ ముఠా సభ్యులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జాతీయ, రాష్ట్ర రహదారులపై దారి దోపిడీలు, ఇళ్లలో దొంగతనాలు, హత్యలకు పాల్పడే ప్రమాదకరమైన ముఠాగా పార్థి గ్యాంగ్‌కు పేరుంది. మహారాష్ట్ర మూలాలు కలిగిన ఈ గ్యాంగ్ ఉమ్మడి జిల్లాలో మూడు నెలలుగా రెచ్చిపోతోంది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి వెంట దోపిడీలు చేస్తూ వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. గతంలో ఇతర రాష్ట్రాల్లో దోపిడీలకు పాల్పడిన ఈ గ్యాంగ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రవేశించి దారుణాలకు పాల్పడుతోంది. దోపిడీలకు అడ్డొస్తే క్రూరంగా హత్యలు చేసే ఈ గ్యాంగ్ కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు ఎట్టకేలకు ఇద్దరిని పట్టుకున్నారు. మిగతా ఇద్దరిని పట్టుకునేందుకు మహారాష్ట్రకు పోలీసు బృందాన్ని పంపించారు.

కట్టంగూర్ వద్ద హత్య పార్థి గ్యాంగ్ పనే..

జాతీయ రహదారి వెంట ఇటీవలి కాలంలో జరిగిన దారి దోపిడీలు, హత్య పార్థి ముఠా పనిగానే పోలీసులు గుర్తించారు. శుక్రవారం పెద్ద అంబర్‌పేట్ సమీపంలోని ఔటర్ రింగురోడ్డు వద్ద పట్టుకున్న ఇద్దరు దొంగలు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. మే 18వ తేదీన హైదరాబాద్‌లో ఇంటిసామాను దింపి తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పామర్రు మండలం చెట్లవారి పురం గ్రామానికి వెళ్తున్న కొల్లూరి రాజవర్ధన్ అనే డీసీఎం డ్రైవర్ కట్టంగూర్ మండలంలోని ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద డీసీఎం ఆపుకొని నిద్రిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అతని కాళ్లను కట్టేసి, గొంతు నులిమి దారుణంగా హత్య చేశారు. రోడ్డుకు అవతలివైపున పడేశారు. ఈ హత్య తామే చేశామని దొంగలు ఒప్పుకున్నట్లు తెలిసింది. అదే కాదు.. ఇతర ప్రాంతాల్లో మరో రెండు హత్యలు చేశామని అంగీకరించినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

పార్థి గ్యాంగ్ చేసిన అరాచకాలెన్నో..

గడిచిన ఐదు నెలల్లో మొత్తంగా నల్లగొండ జిల్లాలో 279 దొంగతనం కేసులు నమోదు కాగా, అందులో 46 కేసుల్లో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఏప్రిల్, మే నెలల్లోనే 103 దోపిడీ, దొంగతనం కేసులు నమోదు కాగా కేవలం మూడు కేసుల్లోనే నిందితులు దొరికారు. మిగతా కేసుల్లో ఎలాంటి పురోగతీ లేదు. అయితే ఏప్రిల్, మే నెలల్లో జరిగిన ఈ దోపిడీలు, దొంగతనాల్లో 15 ఘటనల్లో వారి ప్రమేయమే ఉన్నట్లు శుక్రవారం దొరికిన దొంగలు ఒప్పుకున్నట్లు తెలిసింది. జూన్ 22వ తేదీన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పాండ్రేగుపల్లికి చెందిన కాత్రాల ఉపేందర్, తన స్నేహితుడు బాబాతో కలిసి హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని స్వాతి దాబా వద్ద ఆగి రొట్టెలు తిన్నారు. నిద్ర రావడంతో కారులోనే పడుకున్నారు. అర్ధరాత్రి 2.40 గంటల ప్రాంతంలో నిద్ర లేచారు. అంతకుముందే కారు డ్యాష్ బోర్డులో పెట్టిన రూ.2.21 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతోపాటు జూన్ 9వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని జాతీయ రహదారి వెంట ఉన్న ట్రక్ బేలో తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పల్లెపు శృతి ఆమె అన్న పంచాక్షరి, వదిన అఖిల, వారి కుమారుడు దేవాన్ష్ కారు ఆపుకొని నిద్రిస్తున్న సమయంలో కారుపై రాళ్లతో దాడి చేసి బంగారం దోచుకెళ్లారు. అది ఈ గ్యాంగ్ పనేనని పోలీసులు భావిస్తున్నారు.



పార్థిగ్యాంగ్ సభ్యులు పట్టుబడిన పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని ప్రాంతం



మూడు నెలలు దొంగతనం.. మహారాష్ట్రలో విక్రయం

ఒక ప్రాంతంలో మూడు నెలలపాటు వరుస దొంగతనాలు చేస్తారని, ఆ తరువాత మూడేళ్లపాటు ఆ ప్రాంతానికి రాకుండా, మరో ప్రాంతానికి వెళ్లి దొంగతనాలు చేయడం వీరి ప్రత్యేకత అని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. తద్వారా తాము పోలీసులకు దొరక్కుండా ఉంటామనే ఆలోచనతో అలా చేస్తారని చెబుతున్నారు. మరోవైపు ఈ గ్యాంగ్ చోరీ చేసిన బంగారం, ఆభరణాలను మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయిస్తామని ఒప్పుకున్నట్లు తెలిసింది. జింకలను వేటాడటమే వృత్తిగా కలిగిన పార్థి గ్యాంగ్ కుటుంబాలు మహారాష్ట్రలోనూ ఎక్కువ శాతం గుట్టల్లోనే నివసిస్తాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు తాము దోపిడీ చేసే సమయంలో ఎవరైనా అడ్డువస్తే కిరాతకంగా హతమార్చేందుకు వెనుకాడకపోవడం వారి నైజమని పేర్కొంటున్నాయి.

దొరికిపోయే రోజున దొంగతనం

పోలీసులు వలపన్ని పట్టుకున్న పార్థి గ్యాంగ్‌లోని ఇద్దరు దొంగలు శుక్రవారం తెలవారుజామున ఉదయం 3 గంటలకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం దగ్గర ఒకరి ఇంట్లో కత్తులతో బెదిరించి చోరీ చేశారు. అంతకుముందు చౌటుప్పల్‌లోనూ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. గతంలో కట్టంగూర్ వద్ద ఒక బైక్ దొంగతనం చేసి దానిని అబ్దుల్లాపూర్‌మెంట్ వద్ద వదిలేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ గ్యాంగ్ సభ్యులు సాధారణంగా ఫోన్లు వినియోగించరని, బాధితుల ఫోన్లను తీసుకొని వాడుకుంటారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అత్యవసరం అయినప్పుడే తమ సొంత ఫోన్లను వినియోగిస్తారని, దొంగల్లో ఒకడు తన భార్యకు సొంత ఫోన్‌లో మాట్లాడగా, అదే ఫోన్‌నంబరు గతంలో దోపిడీ జరిగిన ప్రాంతంలో యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారిని గుర్తించినట్లు తెలిసింది.

పంటల నమోదు పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చూడాలి
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో పంటల నమోదు పక్కాగా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సర్వే నంబర్ ఆధారంగా పంట వేసిన వెంటనే పంట నమోదు చేపట్టాలన్నారు. జిల్లాలోని రైతులకు త్వరలో రుణమాఫీ ఉన్నందున ప్రభుత్వ మార్గదర్శకాలు అందిన వెంటనే వ్యవసాయ, బ్యాంక్ అధికారులతో సమావేశాలు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. రైతు వేదికల ద్వారా రైతులకు వివిధ పంటలసాగు విధానాలపై సలహాలు అందించాలన్నారు. జిల్లాలో ఈ సారి ఆయిల్ పామ్ తోటల సాగు లక్ష్యం 2,500 ఎకరాలు ఉందని.. ఆ దిశగా వ్యవసాయ శాఖ.. ఏఈఓలతో కలిసి లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగయ్య, ఏడీఏలు సంధ్యారాణి, జగ్గూనాయక్, ఉద్యాన అధికారులు కె.జగన్, వి.స్రవంతి, అనిత, బి.రవినాయక్, ఏఓలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా విద్యాబోధన ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం డీఈఓ అశోక్‌తో కలిసి సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ తప్పకుండా ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయుల రోజువారి హాజరును తనకు పంపాలని కలెక్టర్ డీఈఓకు ఆదేశించారు. ఉత్తమబోధన చేసిన ఉపాధ్యాయులకు అవార్డులు, ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు మొక్క అందించి స్వాగతం పలుకుతున్న జెడ్పీ సీఈఓ

జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట టౌన్: జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలకవర్గం పదవీకాలం పూర్తికావడంతో జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్.. జెడ్పీ కార్యాలయ ఆవరణాన్ని పరిశీలించారు. కార్యాలయం వెనుక ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి పూల మొక్కలు నాటాలని సూచించారు. కలెక్టర్‌కు జెడ్పీ సీఈఓ అప్పారావు, డిప్యూటీ సీఈఓ శిరీష, కార్యాలయ అధికారులు స్వాగతం పలికారు.

సీపీఐ బలోపేతానికి కృషిచేయాలి

సూర్యాపేట: జిల్లాలో సీపీఐ, దాని అనుబంధ ప్రజా సంఘాల బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషిచేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ కార్యవర్గ, కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విద్యార్థి, యువజన, రైతు, వ్యవసాయ, మహిళా, కార్మిక సంఘాలను విస్తరింప చేయటం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉంటారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, యాదగిరి, ధనుంజయ నాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, రాములు, హనుమంతరావు, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, కోటమ్మ, రెమిడాల రాజు, కొండలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దళారులను నమ్మి మోసపోవద్దు

- నేరుగా కార్యాలయాల్లోనే సంప్రదించాలి
- ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జి డీటీసీ సురేష్‌రెడ్డి



నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని ప్రజలు రవాణా శాఖ కార్యాలయాల్లో సిబ్బందిని నేరుగా సంప్రదించి సేవలను పొందాలని ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జి డీటీసీ సురేష్‌రెడ్డి తెలిపారు. రవాణా శాఖ సేవల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగామ జిల్లాల ప్రజలు నేరుగా తమ రవాణా శాఖ కార్యాలయాల సిబ్బందిని కలసి బుకింగ్ చేసుకున్న స్లాట్ ప్రకారం పనులను చేసుకోవాలని సూచించారు. స్లాట్‌ను ప్రజలే స్వయంగా మొబైల్ ద్వారా లేదంటే ఆన్‌లైన్‌లో https:// tgtransport.net లేదంటే మీ సేవ కేంద్రాల్లో బుక్ చేసుకొని నిర్ణీత ఫీజును చెల్లించి రవాణా శాఖ కార్యాలయాల్లోనే పత్రాలు అందజేసి సేవలు పొందాలని వివరించారు. డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్, డూప్లికేట్ లైసెన్స్, బ్యాడ్జి జారీ, ప్రస్తుత డ్రైవింగ్ లైసెన్స్ సరెండర్ చేసి స్మార్ట్ కార్డ్ పొందడం, లైసెన్స్ చరిత్ర పత్రం జారీ, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, డ్రైవింగ్ లైసెన్స్‌లో అడ్రస్‌లో మార్పు, హజార్డస్ (ప్రమాదకర) వాహన లైసెన్స్ ఆమోదం, కాల పరిమితి ముగిసిన లెర్నర్ లైసెన్స్ ఆమోదం, అదనపు వాహన క్లాస్ లెర్నింగ్ లైసెన్స్, గడువు ముగిసిన డ్రైవింగ్ లైసెన్స్ స్థానంలో లెర్నింగ్ లైసెన్స్ జారీ, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో అడ్రస్ మార్పు, తెలంగాణ పరిధిలో క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీ, కొత్త పర్మిట్ జారీ, డూప్లికేట్ పర్మిట్ జారీ, పర్మిట్ పునరుద్ధరణ, తాత్కాలిక / స్పెషల్ పర్మిట్ జారీ వంటి సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చని, సంబంధిత పత్రాలు (రిజిస్ట్రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు) ప్రజల ఇంటికే పంపిస్తామని వివరించారు. మరేదైనా సమాచారం కావాలంటే ఏఓ, డీటీఓ, డీటీసీని సంప్రదించాలని సూచించారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఎన్నికల సమయంలో వికలాంగులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీల్లో భాగంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని నేటికీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. డిసెంబర్ నుంచి పెన్షన్‌ను పెంచి ప్రతినెలా 5వ తేదీ లోపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముల్కలపల్లి రవి, అయా సంఘాలు, ఎంఎస్‌పీ నాయకులు కర్ల విజయరావు, పేరెల్లి బాబు, ఎండీ.జహీర్ బాబా, రావి స్నేహలత చౌదరి, చింత సాంబయ్య, మిద్దె సైదులు, పేర్ల సోమయ్య, శ్రీనివాస్ గౌడ్, గార్లపాటి వెంకట్ రెడ్డి, దాచేపల్లి నాగమణి, ధారావత్ పద్మ, శ్రీనివాసరావు, ఇంద్రాల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్ మనక్'కు ఆహ్వానం

- నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా..
- 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అవకాశం
- ప్రారంభమైన ఆన్‌లైన్ నామినేషన్ల ఎంట్రీ
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు



సూర్యాపేట టౌన్: విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే ప్రయోగాల వైపు మళ్లించి నూతన ఆవిష్కరణలు చేపట్టేలా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఆరేళ్ల నుంచి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి గాను నామినేషన్లను ఆహ్వానిస్తోంది.

మొదలైన ఆన్‌లైన్ నామినేషన్ల ప్రక్రియ

జిల్లాలో 234 ప్రభుత్వ ఉన్నత, 78 ప్రాథమికోన్నత, 230 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సుమారు 50వేల మంది వరకు ఉన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిన నామినేషన్లు సమర్పించాలి. ప్రయోగాలు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు అనే లక్ష్యం నెరవేరేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. అన్ని ఇన్‌స్పైర్ అవార్డు మనక్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను విద్యాశాఖ ఆదేశించింది. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని విద్యాశాఖ అధికారి సూచించారు.


ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10వేలు

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. ఇందుకు ముందుగానే విద్యార్థి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత ప్రాజెక్టు నమూనా ప్రతిపాదన పంపించాల్సి ఉంటుంది. ఎంపికైతే ఆ ప్రాజెక్టు తయారు చేయడానికి ఖర్చు కింద రూ.10వేలు విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. జిల్లా స్థాయిలో వచ్చిన ప్రాజెక్టుల నుంచి 10శాతం ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో వచ్చిన ప్రాజెక్టుల నుంచి 10శాతం ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులకు రూ.10వేల చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. అయితే 2023–24 ఇన్‌స్పైర్ మనక్ అవార్డు పోటీకు జిల్లా నుంచి 60 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

నేడు అవగాహన సదస్సు

జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు, విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ ప్రక్రియపై శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అవగాహన కల్పించనున్నారు. విషయ నిపుణులతో కూడిన ప్యానల్ బృందం టీ శాట్ ద్వారా అవగాహన కల్పించనుంది. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని తప్పకుండా వీక్షించాలని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

ఆగస్టు 30 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



అన్ని పాఠశాలల నుంచి తరగతుల వారీగా విద్యార్థుల ప్రాజెక్టులను ఆన్‌లైన్ ఆగస్టు 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు కృషిచేయాలి. గడువు సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఉన్నా అంతకు ముందే చేసుకుంటే బాగుంటుంది. విద్యార్థులను ప్రయోగాల వైపు మళ్లించేందుకే కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

– ఎల్. దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి, సూర్యాపేట

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

భానుపురి (సూర్యాపేట): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రంలోని బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేసి సింగరేణికి కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలం, నీట్ పరీక్షను రద్దు చేయాలని శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వరరావు, కోట గోపి, నరసింహారావు, వెంకన్న, వెంకట్‌రెడ్డి, శేఖర్, రవి, ముత్యాలు, పులుసు సత్యం, సత్యనారాయణ, రజిత, శంకర్, కిరణ్, సైదులు, నాగయ్య, సింహాద్రి, భరత్, నర్సిరెడ్డి, శ్రీధర్, మైబెల్లి, వినోద్‌రెడ్డి, రేణుక, చంద్రకళ, రాములు, కృష్ణ, సైదా, చిన్న రాములు, సాయికుమార్, జహంగీర్, లింగయ్య, యాదగిరి, ఎల్లయ్య, పుల్లయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, కిశోర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లగొండ: ఐటీఐల్లో అడ్మిషన్లకు రెండవ విడత నోటిఫికేషన్ జారీచేసినట్లు జిల్లా ఐటీఐల కన్వీనర్ /ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్లను ఈ నెల 4 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. http://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు క్రికెట్ జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–25 క్రికెట్‌జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అమీనుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్, జన్మదిన ధ్రువీకరణపత్రం, 10వ తరగతి మెమో తీసుకొని హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9885717996, 9966341789 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

యాదగిరిగుట్ట: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం యాదగిరిగుట్ట డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న రాత్రి 8 గంటలకు యాదగిరిగుట్ట నుంచి బస్సు బయల్దేరి 20వ తేదీ ఉదయం 8 గంటలకు కాణిపాకం చేరుకుంటుందని పేర్కొన్నారు. కాణిపాకంలో భోజనం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరి సాయంత్రం 5గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌కు చేరుకొని అక్కడ దర్శనం అనంతరం అదేరోజు రాత్రి 8.30 బయలుదేరి రాత్రి 12గంటలలోపు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 21వ తేదీన అరుణాచలం ×గిరి ప్రదక్షిణ¥ పూర్తి చేసుకున్న అనంతరం సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి యాదగిరిగుట్టకు బస్సు తిరుగు ప్రయాణమవుతుందని, 22వ తేదీన ఉదయం 8 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుంటుందని పేర్కొన్నారు. టోల్ ప్లాజా, బార్డర్ టాక్స్ కలిపి సూపర్ లగ్జరీ బస్సుకు పెద్దలకు రూ.4వేలు, చిన్న పిల్లలకు రూ.2,500, డీలక్స్ బస్సులో పెద్దలకు రూ.3,800, చిన్నపిల్లలకు రూ.2,300, ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు రూ.3,500, చిన్న పిల్లలకు రూ.2వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గరిడేపల్లి: మండల పరిధిలోని ఎల్బీనగర్‌లో ట్రాక్టర్ పల్టీ కొట్టి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రెడపంగు నాగయ్య (42) గురువారం తన వ్యవసాయ పొలం దున్నడానికి ట్రాక్టర్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా 10వ నంబర్ కాలువలోకి ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పురుగుమందు తాగిన యువకుడు మృతి


వంశీ (ఫైల్)

అడ్డగూడూరు: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన అడ్డగూడూరు మండల పరిధిలోని కోటమర్తి గ్రామంలో చోటుచేసుకుంది. కోటమర్తి గ్రామానికి చెందిన మందుల వంశీ (23) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అతడిపై పోక్సో కేసు నమోదు కాగా.. జైలుకు వెళ్లి ఇటీవల గ్రామానికి వచ్చాడు. దీంతో కొంతమంది వ్యక్తులు అతడిని బెదిరించారు. మనోవేదనకు గురైన వంశీ జూన్ 15 తేదీన గడ్డి మందు తాగాడు. అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


మట్టయ్య(ఫైల్)

త్రిపురారం: వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కోదాడ, త్రిపురారం, చివ్వెంల, మునగాల మండలాల పరిధిలో శుక్రవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన మునగ మట్టయ్య అతడి భార్య నాగలక్ష్మి, కూతురు వర్షిణితో కలసి బైక్‌పై త్రిపురారం వైపు వస్తున్నారు. సత్యనారాయణపురం గ్రామ శివారు వద్దకు రాగానే అదే సమయంలో నీలాయిగూడేనికి చెందిన నవీన్ రెడ్డి టాటాఏస్ వాహనంపై అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న మట్టయ్య బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో వీరిని మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మునగ మట్టయ్య మృతి చెందగా భార్య, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి అన్న మునగ నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురారం ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.


త్రిపురారం: బోల్తాపడిన టాటా ఏస్

కారు మోపెడ్‌ను ఢీకొట్టడంతో..


సోమయ్య (ఫైల్)

చివ్వెంల: కారు అదుపు తప్పి మోపెడ్‌ను ఢీకొట్టడంతో గుడి పూజారి మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన బొడ్డు సోమయ్య (60), రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి, ప్రస్తుతం చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో ఉన్న శ్రీ గంగా మల్లిఖార్జునస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఆలయానికి మోపెడ్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో సోమయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం పట్టణానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..

మునగాల(కోదాడ): ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ముగ్గురు భోగేశ్వరపు పవన్ కుమార్(19), అతడి బాబాయ్ భోగేశ్వరపు భాసేశ్వరరావు, ఈయన కుమారుడు వెంకటేష్‌లు స్కూటీపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు స్కూటీపై వెళ్తున్నారు. మార్గమధ్యంలో మాధవరం శివారులోని నేలమర్రి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. భాసేశ్వరరావు, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మునగాల ఎస్ఐ అక్కడకు చేరుకొని గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటేష్(13) పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పవన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన బైక్

- అన్న మృతి, చెల్లెలికి గాయాలు


హరికిషోర్‌రెడ్డి (ఫైల్)

కోదాడరూరల్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని గణపవరం శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వుకు చెందిన కందుల వెంకటరెడ్డి కుమారుడు హరికిషోర్‌రెడ్డి(19), కుమార్తె నవీన ఇంటర్మీడియట్ పూర్తి చేసి బీటెక్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో అన్నాచెల్లెలు కంప్యూటర్‌లో శిక్షణ తీసుకునేందుకు బైక్‌పై కోదాడకు వస్తున్నారు. గణపవరం శివారులోని పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో కిషోర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా.. నవీనకు చేయి విరిగింది. తీవ్రంగా గాయపడిన కిషోర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- రెండు ద్విచక్రవాహనాలు, ఆటో, నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాము, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

కోదాడ రూరల్: ద్విచక్రవాహనాలతో పాటు ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని ఎస్ఎస్పీ క్యాంప్‌కు చెందిన మామిడి గోపి ఏపని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వానాలు, ఆలయాల్లో చోరీకి పాల్పడుతూ వాటిని అమ్ముకుని జల్సా చేస్తున్నాడు. కోదాడ, మిర్యాలగూడ స్టేషన్‌ల పరిధిలోని రెండు ద్విచక్రవాహనాలను, పెన్‌పహాడ్ మండలంలో రెండు, నూతనకల్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని ఓ ఆలయంలో హుండీతో పాటు ఇత్తడి, బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. కూసుమంచి ఆలయంలో చోరీ చేయగా వచ్చిన నగదుతో ఓ ఆటోను కొనుగోలు చేశాడు. అతనిపై ఇప్పటికే హుజూర్‌నగర్, గరిడేపల్లి, చిలుకూరు, సూర్యాపేట, నూతనకల్, మహబూబాబాద్, ఖమ్మం స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. కాగా.. దొంగిలించిన ఆభరణాలను కోదాడలో విక్రయించేందుకు వస్తుండగా పట్టణంలోని గోల్డ్ షాప్‌బజారులో పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రెండు ద్విచక్రవాహనాలతో పాటు ఓ ఆటో, నాలుగు ఇత్తడి గంటలు, కొంత మేర నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బ్యాగులో నుంచి ఆభరణాలు అపహరణ

చిట్యాల: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని ఇద్దరు మహిళలు బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన లవణం ఇందిరా తిరుపతికి వెళ్లి గురువారం తిరుగు ప్రయాణమైంది. ఈక్రమంలో ఆమె హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి చిట్యాల బస్‌స్టేషన్‌లో దిగింది. తన స్వగ్రామమైన రామన్నపేటకు వెళ్లేందుకుగాను ఆటో ఎక్కింది. తన బ్యాగును ఆటోలో వెనక వైపు పెట్టింది. ఈక్రమంలో.. ఇద్దరు గుర్తుతెలియని మహిళలు మాస్కులు ధరించి ఆటో ఎక్కారు. బాధిత మహిళ ఉంచిన బ్యాగు పక్కన కూర్చుకున్నారు. వీరిద్దరు రామన్నపేట గ్రామ శివారులోకి రాగానే మార్గమధ్యంలో దిగిపోయారు. ఇంటికి వెళ్లిన ఇందిరా తన బ్యాగును పరిశీలించుకోగా బంగారు కమ్మలు, వెండి పట్టీలతో పాటు కొంత నగదు ఉంచిన కవర్ కనిపించలేదు. శుక్రవారం చిట్యాలకు చేరుకుని బస్‌స్టేషన్ సమీపంలోని సీసీ కెమెరాలు, రామన్నపేట శివారులో చోరీకి పాల్పడిన మహిళలు దిగిన చోట ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా చిట్యాల బస్‌స్టేషన్ ఆవరణలో ఆటో ఎక్కిన ఇద్దరు మహిళలు, రామన్నపేట శివారులో దిగి, అనంతరం మరో ఆటోలో తిరిగి చిట్యాల వైపునకు ప్రయాణమైనట్లు గుర్తించారు. దీంతో బాధితురాలు ఇందిరా శుక్రవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకుగాను వెళ్లగా రామన్నపేటలో ఫిర్యాదు చేయాల్సిందిగా పోలీసులు సూచించారు.

పుస్తెలతాడు చోరీ

డిండి: మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు పుస్తెలతాడును అపహరించాడు. ఈ సంఘటన డిండి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో కొరివి వెంకటరమణమ్మ నివాసం ఉంటుంది. ఈక్రమంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి వెంకటరమణమ్మ మెడలో ఉన్న దాదాపు నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్లాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. వెంకటరమణమ్మ జరిగిన విషయం చెప్పగా.. వారు కాలనీలో ఎంత వేతికినా దొంగ ఆచూకీ తెలియలేదు. ఈమేరకు వెంకటరమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చౌటుప్పల్ : తాళం వేసిన ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వరకాంతం బాలమణి తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుమారుడు సందీప్‌రెడ్డి వద్దకు ఈనెల 1న వెళ్లింది. శుక్రవారం ఉదయం పక్కింటి వారు బాలమణి ఇంటి గేటుకు వేసిన తాళం యథావిధిగా ఉండడం, లోపల ప్రధాన ద్వారానికి వేసిన తాళం తీసి ఉండడాన్ని గమనించారు. వారు అనుమానంతో వెంటనే బాలమణికి ఫోన్‌లో సమాచారం అందించారు. హుటాహుటిన స్వగ్రామానికి వచ్చిన బాలమణి కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడాన్ని గుర్తించారు. అందులో దాచిపెట్టిన తులం విలువైన బంగారు చెవికమ్మలు, సుమారుగా రూ.20వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి కుమారుగు సందీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

బ్యాటరీలు మాయం

చౌటుప్పల్: మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామంలో ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి బ్యాటరీలు చోరీ చేశారు. గ్రామంలో నందగిరి వెంకటేశంకు చెందిన రెండు డీసీఎం వాహనాలు, రేపాక యాదయ్య, పిసాటి నర్సిరెడ్డికి చెందిన ట్రాక్టర్లు, నందగిరి యాదయ్యకు చెందిన డీసీఎంను తమ ఇంటి ఎదుట నిలుపుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. ఒక్కో బ్యాటరీ విలువ సుమారుగా రూ.12వేల వరకు ఉంటుందని, చోరీకి గురైన మొత్తం బ్యాటరీల విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని వాహన యజమానులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగర్‌ను సందర్శించిన శ్రీలంక మీడియా ప్రతినిధులు


బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేస్తున్న శ్రీలంక దేశ మీడియా ప్రతినిధులు

నాగార్జునసాగర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, మీడియా అంశాలపై 15రోజుల శిక్షణలో భాగంగా శ్రీలంక దేశానికి చెందిన 30మంది మీడియా ప్రతినిధుల బృందం శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చింది. ఈ పర్యటనలో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, నాగార్జునకొండ తదితర ప్రాంతాలను సందర్శించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో శ్రీలంక మీడియా ప్రతినిధుల బృందం గత నెల 24నుంచి ఈనెల 7వరకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ నిమిత్తం మనదేశానికి వచ్చింది. 15రోజుల శిక్షణలో భాగంగా బృందం ముందుగా హైదరాబాద్, వరంగల్, జహీరాబాద్, తదితర ప్రాంతాలను సందర్శించింది. శుక్రవారం జిల్లాకు రాగా జిల్లాలోని నాగార్జునసాగర్‌లో బృందానికి మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావు, సమాచార శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి బుద్ధవనం, నాగార్జునకొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, నల్లగొండ జిల్లా వివరాలను ఆర్డీఓ, ఏడీలు వివరించారు. బుద్ధవనం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ విశేషాలను వివరించారు. సాగర్ ప్రాజెక్టు గురించి జేఈ సత్యనారాయణ వివరించారు. కాగా.. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్‌గోయల్ ఈ 15రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. కోర్సు డైరెక్టర్‌గా డాక్టర్ ఆర్.మాధవి వ్యవహరించారు. జిల్లాకు వచ్చిన వారిలో శ్రీలంక ప్రధానమంత్రి సలహాదారు (మీడియా, విదేశీవ్యవహారాలు) సుగీస్వర పి.సేనదీర నేతృత్వంలో శ్రీలంకలోని వివిధ ప్రావెన్స్‌లలో పౌరసంబంధాల శాఖలో పనిచేసే అధికారులు ఉన్నారు. వారి వెంట తహసీల్దార్ శరత్, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

యాదాద్రీశుడి సన్నిధిలో తోగుట పీఠాధిపతి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని తోగుట పీఠాధిపతి మాధవానందస్వామిజీ శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆసీనులై ఆలయ విశిష్టతను, శ్రీస్వామి వారి వైభవాన్ని భక్తులకు వివరించారు. స్వామిజీకి అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు పండ్లు, ప్రసాదం అందజేశారు.


తోగుట పీఠాధిపతి మాధవానంద స్వామిజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు


యాదాద్రికొండపై మద్యం బాటిల్, గుట్కా ప్యాకెట్లు లభ్యం


క్యూకాంప్లెక్స్‌లోని పురుషుల బాత్‌రూమ్‌లో పైపుల మధ్యలో పెట్టిన మద్యం బాటిల్


పైపుల మధ్యలో ఉంచిన గుట్కా ప్యాకెట్

యాదగిరిగుట్ట : పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలో మద్యం బాటిల్, నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించిన సంఘటన కలకలం రేపింది. కొండపై గల క్యూకాంప్లెక్స్‌లో ఉన్న పురుషుల బాత్‌రూంలో ఓ లిక్కర్ బాటిల్‌తో పాటు తిని పడేసిన గుట్కా ప్యాకెట్లను శుక్రవారం భక్తులు గుర్తించారు. ఆలయ సిబ్బంది కొండపైకి విధుల్లోకి వచ్చిన సమయంలో మద్యం సేవించి బాటిల్ బాత్‌రూంలో పెట్టి వెళ్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎస్పీఎఫ్ పోలీసుల నిఘా లోపం, ఆలయాధికారుల పర్యవేక్షణ లోపంతోనే మద్యం బాటిల్‌లో కొండపైకి తీసుకువచ్చి సేవిస్తున్నారని భక్తులు అంటున్నారు. ఈ విషయమై ఈఓ భాస్కర్‌రావును సంప్రదించగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉంది. ఇక సంబంధింత అధికారిని వివరణ కోసం ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


రేణుక (ఫైల్)

వేములపల్లి : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మాడుగులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్రి రేణుక శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న ఇనుప దండానికి బట్టలు ఆరేస్తుండగా ఆదండానికి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై ఇంటి బేస్మెంట్‌పై పడడింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి భర్త రాజు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందగా రేణుక విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఆమె మృతితో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. రేణుక మృతితో గ్రామప్రజలు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్ కార్యకర్తలను చితకబాదిన పోలీసులు

- ఒకరికి తీవ్ర గాయాలు
- డీసీపీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆకుల శేఖర్, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డిని యాదగిరిగుట్ట ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి, సిబ్బంది చితకబాదిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు వెళ్లే దారి వెంట కొందరు వ్యాపారులు రేకుల షెడ్లు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై బీఆర్ఎస్ కార్యకర్తలు ఆకుల శేఖర్, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, బోడి సాయిలు ఈ నెల 3వ తేదీన మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ స్పందించకపోవడంతో ఆకుల శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి గురువారం అక్కడికి వెళ్లి తోపుడుబండిని తొలగించాలని కొబ్బరి బోండాల వ్యాపారి లక్ష్మి అనే మహిళకు సూచించారు. దీంతో అమె తన భర్త అందుబాటులో లేడని చెప్పింది. మహిళ సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులే కొబ్బరిబోండాలను అక్కడినుంచి తీస్తుండగా సదరు మహిళ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనపై దాడి చేశారంటూ వారిపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం రాత్రి ఆకుల శేఖర్, బోడి సాయిలును స్టేషన్‌కు పిలిపించారు. సమాచారం అందుకున్న రాజేశ్వర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ వారిని ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. అయినా వినిపించుకోకుండా ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు కానిస్టేబుల్స్ లాఠీ, పట్టా (బెల్టు)తో ఆకుల శేఖర్‌ను కొడుతుండగా రాజేశ్వర్‌రెడ్డి అడ్డుకోబోయాడు. దీంతో ఆగ్రహం చెందిన పోలీసులు.. రాజేశ్వర్‌రెడ్డిని సైతం లాఠీ విరిగేలా కొట్టినట్లు బాధితుడు రోదిస్తూ వెల్లడించాడు. ఆకుల శేఖర్ కళ్లలో రెండుసార్లు కారం చల్లి కొట్టారని ఆరోపించారు.

సస్పెండ్ చేయాలని డిమాండ్..

తమను తీవ్రంగా కొట్టిన ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డితో పాటు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రమేష్, ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డితో కలిసి డీసీపీకి వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీ నేతల అండ చూసుకుని పోలీసులు తమను తీవ్రంగా కొట్టారని ఆరోపించారు.

ఎవరినీ కొట్టలేదు : సీఐ రమేష్

ఈ విషయమై యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్‌ను వివరణ కోరగా తమ సిబ్బంది ఎవరినీ కొట్టలేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొబ్బరిబోండాల వ్యాపారానికి ఆటంకం కలిగిస్తున్నారని, కొబ్బరి బోండాలు కిందపడేశారని బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు చేయడం వల్లే బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించామన్నారు. అప్పటికే ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ఉన్నారని, ఎక్కడ కింద పడ్డారో తెలియదని, వారి గాయాలకు, తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. తమతో మర్యాదలేకుండా వ్యవహరించారని సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టడం అమానుషం


యాదగిరిగుట్ట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, తీవ్రంగా కొట్టడం అమానుషమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి అన్నారు. అకారణంగా ఆకుల శేఖర్, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, బోడి సాయిని తీవ్రంగా చితకబాదడంతో శుక్రవారం పట్టణ ప్రధాన రహదారిపై బైఠాయించి పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి అడ్డుగా వేసిన షెడ్లు, తోపుడుబండ్లను తొలగించాలని వారం రోజులుగా బీఆర్ఎస్ కార్యకర్తలు చెబుతున్నారని, ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సైతం అందజేశారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అక్రమంగా షెడ్డు నిర్మాణం చేయడంతో పాటు తోపుడు బండ్లు పెట్టవద్దని అభ్యంతరం చెప్పినందుకు ఓ మహిళా వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. అన్యాయంగా కార్యకర్తలను కొట్టిన ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డితో పాటు సహకరించిన పట్టణ సీఐ రమేష్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం భువనగిరిలోని డీసీపీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, బాధిత కార్యకర్తలు డీసీపీ రాజేష్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ బాబా, నాయకులు ఆరె యాదగిరిగౌడ్, ఆరె శ్రీధర్‌గౌడ్, బాలయ్య, రేపాక స్వామి, వీరేశం, బిట్టు కుమార్, కల్యకొలను సతీష్‌రాజ్, బాబా, వాసం రమేష్, శారాజీ రాజేష్, క్రాంతి, కృష్ణయ్య, మహేందర్ తదితరులున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతపల్లి: చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు సమీపంలో హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బిహార్‌కు చెందిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరా ప్రకారం.. కుర్మేడు గ్రామం వద్ద కోళ్ల ఫారంలో కూలీలుగా పని చేస్తున్న వీరు మాల్‌కు పనినిమిత్తం వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కుర్మేడు సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. స్థానికులు వారిని గమనించి చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.